క్లుప్తంగా

నేడు ఈదుల్ ఫితర్



కద్తాల్: ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మైనార్టీ నాయకులు

కద్తాల్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం నిర్వహించబోయే ప్రత్యేక ప్రార్థనల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మజీద్ కమిటీల నిర్వాహకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఈద్గాల వద్ద ఏర్పాట్లను బుధవారం మజీద్ కమిటీ నిర్వాహకులు పరిశీలించారు. ఎండల నేపథ్యంలో ఈద్గా వద్ద నమాజు చేసేందుకు వీలుగా చలవపందిర్లు ఏర్పాటు చేయడంతో పాటు నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈద్గాలకు రంగులు వేసి అలంకరించారు. మండల కేంద్రంలోని ఈద్గా వద్ద గురువారం ఉదయం 8:30 గంటలకు నమాజ్ ప్రారంభమవుతుందని సకాలంలో హాజరుకావాలని మజీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షుడు జావీద్ కోరారు.

ఆమనగల్లు మండలంలో..

ఆమనగల్లు: రంజాన్ పండుగ ఏర్పాట్లను బుధవారం మండల పరిధిలోని మసీదు కమిటీల నాయకులు, పోలీసులు పరిశీలించారు. ప్రత్యేక ప్రార్థనలు చేసుకోవడానికి వీలుగా ఈద్గా వద్ద స్థలాన్ని శుభ్రం చేసి ప్రార్థనలకు అనువుగా సిద్ధం చేశారు. ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్ఐ బల్‌రాం, జామై మసీదు కమిటీ అధ్యక్షుడు మాసూం, పలువురు నాయకులు ఏర్పాట్లను పరిశీలించారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి

భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర



ప్రచారంలో బూర, నాయకులు

తుర్కయంజాల్: దేశంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మరోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని ఆ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి డా.బూర నర్సయ్యగౌడ్ తెలిపారు. మున్సిపాలిటీలోని బ్రాహ్మణపల్లి, తొర్రూర్‌లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. బీజేపీ నాయకులు.. దయానంద్ గౌడ్, ప్రతాప్, రమేష్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌ను గెలిపించుకుందాం

దళిత సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు జ్యోతయ్య

తలకొండపల్లి: విద్యావేత్త, బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌ను గెలిపించుకుందామని దళిత సంఘ జిల్లా కార్యవర్గ సభ్యుడు జ్యోతయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జ్యోతయ్య మాట్లాడారు. గురుకుల పాఠశాలల డైరెక్టర్‌గా ఉన్నప్పుడు అక్కడ నాణ్యమైన విద్యను అందజేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసిన ఘనత ప్రవీణ్‌కుమార్‌కే దక్కుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల జీవితాల్లో మరిన్ని వెలుగులు నింపాలంటే చట్టసభలో ఆయన గళం వినిపించాలన్నారు. పార్టీలకతీతంగా దళిత సంఘాల నాయకులందరూ ఏకతాటిపై వచ్చి ప్రవీణ్ కుమార్‌కు ఓటు వేయాలన్నారు. అంబేద్కర్, పూలే జిల్లా కమిటీ అధ్యక్షుడు శంకర్, సుధాకర్, మల్లేష్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ స్పీకర్ పరామర్శ

మంచాల: తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకుడు డబ్బీకార్ శ్రీనివాస్‌ను రాష్ట్ర మాజీ శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి బుధవారం ఆరుట్లలో పరామర్శించారు. ఇటీవల డబ్బీకార్ శ్రీనివాస్ తల్లి చనిపోయిన విషయం తెలిసిందే. మధుసూదనాచారి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రవి, మాజీ డైరెక్టర్ జానీ పాషా, జిల్లా నాయకులు రఘుపతి, శ్రీనివాస్‌గౌడ్, మహేష్, నిఖిల్ గౌడ్, మల్లాజీ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్ల పంపిణీ

ఇబ్రహీంపట్నం రూరల్: రంజాన్ ఉత్సవాలను పురస్కరించుకొని పీఆర్‌టీయూ మండల కార్యవర్గ సభ్యుడు, ఎంపీపీఎస్ ఎన్గల్‌గూడ ప్రధానోపాధ్యాయుడు మహేందర్‌రెడ్డి సహకారంతో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు పరమేష్ బుధవారం 50 మంది విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పండుగను ప్రశాంతంగా ఆనందంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రాజు, ప్రధానోపాధ్యాయులు కృష్ణలత, సమీనా, విష్ణువర్ధన్, శ్రీనివాస్‌చారి, అహ్మద్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా క్రీడా మైదానాలు

- నిర్వహణ పట్టించుకోని పంచాయతీలు, అధికారులు
- ఆటలు ఆడేందుకు ఉత్సాహం చూపని యువత
- అందుబాటులోకి తేవాలంటున్న ప్రజలు



జాపాలలోని తెలంగాణ క్రీడా మైదానం

మంచాల: బీఆర్‌ఎస్ హయాంలో గ్రామాల్లో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా మైదానాలు నేడు నిరుపయోగంగా మారాయి. కంపచెట్లు, మొక్కలు పెరగడంతో ఆటలు ఆడేందుకు అనువుగా లేకుండా ఉన్నాయి. వివరాల్లోకి వెళ్తే.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో శ్మశాన వాటికలు, నర్సరీలతో పాటు ప్రతి గ్రామంలో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా మంచాల మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో, 12 గ్రామాల్లో క్రీడా మైదానాలను ఏర్పాటు చేసింది. అయితే 9 గ్రామాల్లో ఇంకా పనులు పురోగతిలో ఉన్నాయి. అస్మత్‌పూర్, కాగజ్ ఘాట్ గ్రామాల్లో స్థలం వివాదంలో ఉండటంతో ఇంకాఏర్పాటు చేయలేదు. ఒక్కో క్రీడా మైదానం ఏర్పాటు కోసం ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద రూ.50 వేల నుంచి లక్ష రూపాయాల వరకు ఖర్చు పెట్టారు.

నీరుగారుతున్న లక్ష్యం..

అయితే ఇంత వ్యయం చేసి ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు నేడు చాలావరకు నిరుపయోగంగా మారాయి. ఎక్కడా కూడా వినియోగించడం లేదు. ప్రభుత్వం క్రీడా మైదానంలో ఆటలు ఆడుకోవడానికి ఆట వస్తువులు కూడా గ్రామ పంచాయతీలకు పంపిణీ చేశామని చెబుతుంది. ప్రజలు మాత్రం సక్రమంగా సద్వినియోగం చేసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారు. దీంతో ప్రభుత్వం మంచి ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన క్రీడామైదానాల ఏర్పాటు ప్రక్రియ నీరుగారిపోతుంది. ఇప్పటికైనా గ్రామాల్లో యువత ముందుకు వచ్చి క్రీడా మైదానాలను సద్వినియోగం చేసుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తేవాలి



ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆటస్థలాలను ప్రజలు వినియోగించుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. చాలా గ్రామాల్లో పేరుకే ఆటస్థలం కేటాయించారు. ఆట వస్తువులను ఇవ్వలేదు. టెన్నీస్, వాలీబాల్ వంటి క్రీడలు ఆడుకునే విధంగా చూడాలి.

– భాస్కర్ గౌడ్, జాపాల

పంచాయతీలకు అప్పగించాం



ప్రభుత్వం క్రీడా మైదానాల ఏర్పాటు చేసింది. ఆట స్థలాలు ఏర్పాటు చేయడంతో పాటు క్రీడా వస్తువులు కూడా అందించాం. అయితే వాటిని గ్రామ పంచాయతీలకు అప్పగించాం. త్వరలో వినియోగంలోకి తీసుకువస్తాం.

– తేజ్‌సింగ్, ఎంపీఓ, మంచాల

కాంగ్రెస్‌వి అమలుకాని హామీలు

- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి
- లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధిచెప్పాలని పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: అసెంబ్లీ ఎన్నికల ముందు అమలుకాని హామీలిచ్చి వాటిని నెరవేర్చడంలో జాప్యం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండల బీఆర్‌ఎస్ సమావేశం ఆ పార్టీ మండల అధ్యక్షుడు బుగ్గ రాములు అధ్యక్షతన బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన సత్తు వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని లోక్‌సభ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు బాస్‌లు ఢిల్లీలో ఉంటే బీఆర్‌ఎస్‌కు ఓటర్లే బాస్‌లు అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటువేసి భువనగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్, వైస్ ఎంపీపీ మంచిరెడ్డి వెంకట ప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, జిల్లా సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు రాంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రవీందర్, నర్సింహ, గణేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో ఓటరు అవగాహన ర్యాలీ



ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

ఆమనగల్లు: ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ వసంత కోరారు. ఆమనగల్లు మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారిపై ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరుతూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ పిచ్చయ్య, సిబ్బంది, బీఎల్‌ఓలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు విడుదల చేయండి

ఎంపీడీఓకు వ్యకాస నేతల వినతి



ఎంపీడీఓతో మాట్లాడుతున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం(వ్యకాస) జిల్లా ఉపాధ్యక్షుడు జంగయ్య కోరారు. ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ వెంకటమ్మకు ఈమేరకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. కూలీలకు పేస్లిప్పులు క్రమం తప్పకుండా ప్రతివారం ఇవ్వాలన్నారు. పర్మినెంట్ గ్రూపులు ఏర్పాటు చేయడంతో పాటు ఉదయం పూట పనులు చేయించాలని కోరారు. సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని, రోజువారి కూలీ రూ.600 ఇవ్వాలన్నారు. పని ప్రదేశంలో గాయాల పాలైన కూలీలకు మెడికల్ బిల్లులు ఇవ్వాలని, పని ప్రదేశంలో చిన్న పిల్లలను చూసుకోవడానికి ఆయాలను పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గణేశ్, రమేష్, వ్యకాస నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించొద్దు

- యాసంగి పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి
- పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కేశవరెడ్డి తదితరులు

తలకొండపల్లి: యాసంగిలో రైతులు పండించిన పంటలను దళారులకు విక్రయించి మోసపోకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొద్దుతిరుగుడు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం వైస్ చైర్మన్ రవికుమార్, ఏఓ రాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. అదే విధంగా మండల పరిధిలోని పడకల్, చుక్కాపూర్, గట్టు ఇప్పలపల్లి, వెల్జాల్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ... జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఈ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. పరిసర ప్రాంత రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. ఏ-గ్రేడ్ వరి ధాన్యానికి క్వింటల్‌కు రూ.2,203, నాణ్యతతో కూడిన పొద్దుతిరుగుడుకు రూ.6,760 మద్దతు ధర ఉంటుందన్నారు. వరికి తేమ 17 శాతంలోపు, పొద్దుతిరుగుడుకు 9శాతం లోపు ఉంటే మద్దతు ధర లభిస్తుందన్నారు. చివరిగింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సింగల్ విండో సీఈఓ ప్రతాప్‌రెడ్డి, వైస్ చైర్మన్ రవికుమార్, మండల వ్యవసాయాధికారి రాజు, డైరెక్టర్లు శ్రీను, యాదయ్య, దేవులానాయక్ పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అనుచరులు

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ పార్టీతోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రధాన అనుచరుడు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రమేష్, సీనియర్ బీఆర్‌ఎస్ నాయకులు మహేష్‌గౌడ్, కుమారప్ప, సత్యంగౌడ్ బుధవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కష్టపడి పనిచేసేవారికి తగిని గుర్తింపు ఇస్తామని మల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, కౌన్సిలర్ రమేష్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ సభను విజయవంతం చేయండి

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్

మంచాల: బొంగులూర్ సమీపంలోని ప్రమీద గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించే భువనగిరి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సభకు మాజీ మంత్రి కేటీఆర్ హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ నర్మద, నాయకులు పుల్లారెడ్డి, చంద్రయ్య, బహుదూర్, రాంరెడ్డి, ఇందిర, సుకన్య, భద్రీనాథ్ గుప్తా, అమర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ



వనస్థలిపురంలో కాంగ్రెస్ నాయకులతో మధుయాష్కీ గౌడ్, రినీష్‌రెడ్డి

వనస్థలిపురం: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డికి మద్దతుగా చేపట్టాల్సిన ప్రచారంపై బుధవారం ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని 10 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులతో వనస్థలిపురం పార్టీ కార్యాలయంలో సునీత మహేందర్‌రెడ్డి కుమారుడు రినీష్ రెడ్డితో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ, ఈ నెల 16న ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డి ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తారని, అందుకు తగ్గట్టుగా తగిన ఏర్పాట్లు చేయాలని నాయకులకు సూచించారు. ఆయా డివిజన్ల అధ్యక్షుడు సదాశివుడు, లింగాల కిషోర్ గౌడ్, నర్సింహ యాదవ్, వేణుగోపాల్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, శ్రీపాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

హెల్త్‌కార్డులు ఇవ్వాలి: చింతల

తుక్కుగూడ: రాష్ట్రంలో ప్రైవేటు విద్యా సంస్థలలో పనిచేసే సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా హెల్త్ కార్డులు ఇవ్వాలని ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు చింతల సింహారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్కువ వేతనంతో పని చేస్తున్న వారికి ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వారి ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఉన్నారు.

నేడు పూలే జయంతి

కడ్తాల్: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం మండల ప్రధాన కార్యదర్శి రవిముదిరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో నిర్వహించే వేడుకలకు యువకులు, విద్యావంతులు, మేధావులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నేటి నుంచి నాటక ప్రదర్శన

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్‌లో గురువారం నుంచి శనివారం వరకు 'బీరప్ప చరిత్ర' నాటక ప్రదర్శన నిర్వహించబడుతుందని యాదవ సంఘం అధ్యక్షుడు శేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు రాత్రి 9 గంటల నుంచి తెల్లవారుజాము వరకు నాటక ప్రదర్శన కొనసాగుతుందని చెప్పారు. మూడురోజుల పాటు కొనసాగే ప్రదర్శనను తిలకించడానికి పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలిరాగలరని కోరారు.

రేపు సర్వసభ్య సమావేశం

మంచాల: మంచాల మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ సీఈఓ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త సభ్యుల నమోదు గురించి, బకాయి రుణాల వసూలపై చర్చించడంతో పాటు 2024–25 సంవత్సరం అంచనా బడ్జెట్ ఆమోదం గురించి సమావేశంలో చర్చిస్తామన్నారు. సంఘం సభ్యులతో పాటు పాలకవర్గ సభ్యులు, రైతులు తప్పక హాజరు కావాలని కోరారు.

14న అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు

మాడ్గుల: డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకోని ఏప్రిల్ 14న హైదరాబాద్‌లోని కొత్తపేట్‌లో నిర్వహించే ఉత్సవాలను జయప్రదం చేయాలని తెలంగాణ సోషలిస్టు విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివలింగం బుధవారం ఒక ప్రకటనలో కోరారు. జయంతి రోజున బీజేఆర్ భవన్‌లో అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని మాదాయిపల్లికి చెందిన బాలనాగమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. బుధవారం శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసురెడ్డి బాలనాగమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి సభ్యులతే రూ.4వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా పాపిరెడ్డిగూడంలో మృతిచెందిన మధుకర్ శంకర్‌జీ కుటుంబానికి రూ.4వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాములు, శోభ, చందన్, రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్నదానం



విద్యార్థులకు అన్నదానం చేస్తున్న ఇంద్ర, చంద్రారెడ్డి దంపతులు

కడ్తాల్: జిల్లాలోని బాలాపూర్ మండలం అల్మాస్‌గూడకు చెందిన 'రామిడి సుధీర్‌రెడ్డి' స్మారకార్థం అతడి జయంతిని పురస్కరించుకుని వారి తల్లిదండ్రులు ఇంద్ర, చంద్రారెడ్డి దంపతులు బుధవారం మండల పరిధిలోని మైసిగండి ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కుమారుడి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం అన్నదానం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు నవకిశోర్‌రెడ్డి, శిరీష, మాజీ సర్పంచ్ తులసీరాం, వసతి గృహ సంక్షేమాధికారి బాలరాజ్, ఉపాధ్యాయులు నయిముద్దీన్, శ్రావణ్‌కుమార్, సంతోష్‌కుమార్, సరిత, భగవతి, రమ్య, విజయలక్ష్మి, మంజుల, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

జైపాల్‌యాదవ్‌ను కలిసిన ఆర్‌ఎస్‌పీ



జైపాల్‌యాదవ్‌ను సత్కరించిన ప్రవీణ్‌కుమార్

ఆమనగల్లు: కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కలిశారు. హైదరాబాద్‌లోని జైపాల్‌యాదవ్‌ను కలిసి ఘనంగా సత్కరించారు. లోక్‌సభ ఎన్నికల్లో కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో అనుసరించాల్సిన ప్రచారం కార్యక్రమాలు, వ్యూహాల గురించి వారిద్దరు కొద్దిసేపు చర్చించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, కేశవరావ్ తదితరులు ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి



కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

- మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్
- కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

కందుకూరు: మండలంలోని ధన్నారం, బాచుపల్లి, బేగరికంచె, వావిళ్లకుంటతండాకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ సమక్షంలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం హస్తంపార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ.. ఎంపీ ఎన్నికల్లో అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలని కోరారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేలా చొరవ తీసుకుంటానన్నారు. అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన ధన్నారం మాజీ ఉపసర్పంచ్ మంద నర్సింహ, బీఆర్‌ఎస్ మాజీ ఎస్టీసెల్ అధ్యక్షుడు జరుపుల రూప్లానాయక్, నాయకులు పర్వతాలుయాదవ్, శ్రీకాంత్, నగేశ్, రాజప్ప, జె.రాజు, గణేశ్, రమేశ్, గోపి, కిరణ్ తదితరులకు కేఎల్లార్ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాతనరసింహారెడ్డి, పీసీసీ సెక్రటరీ ఎల్మటి అమరేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణనాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ సర్పంచులు శ్రీదేవిశేఖర్‌రెడ్డి, సా యిలు, దేవిపాండుగౌడ్, మాజీ ఎంపీటీసీ హన్మంత్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌ముదిరాజ్, జగన్, విష్ణువర్ధన్‌రెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి, మల్ల య్య, మల్లేశ్‌యాదవ్, గణేశ్‌నాయక్, యాదగిరి, పర్వతాలు, ధన్‌రాజు పాల్గొన్నారు.